సాక్షి రంగారెడ్డి

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023

ఎమ్మెల్సీ స్థానానికి 4 నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ -రంగారెడ్డి- మహబూబ్ నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అయినేని సంతోష్ కుమార్, వెంకట్ నారాయణ రెడ్డి అయ్యాలపు, బి.వినయ్ బాబు, కాసం ప్రభాకర్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు.

పరిశోధన విద్యలో మహిళలు రాణించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మహిళలు డిగ్రీ, పీజీ కోర్సులతో సరిపెట్టుకోకుండా పరిశోధన విద్యలో రాణించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు.

మార్చి 23, 24,25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఉన్నత విద్యపై 3 రోజుల అంతర్జాతీయ సదస్సు జరగనుంది. మార్చి 23, 24, 25వ తేదీలలో ఆర్ట్స్ కాలేజీ రాజనీతిశాస్త్రం విభాగం సెమినార్ హాలులో జరిగే సదస్సుకు ఓయూ అనుబంధ కాలేజీల పర్మనెంట్, కాంట్రాక్టు, పార్టుటైం పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు హాజరుకావాలని హెడ్ ప్రొ.చంద్రునాయక్ తెలిపారు.

న్యూస్‌రీల్

పోస్టల్ సేవలు విస్తరించాలి



ఆదిబట్ల బ్రాంచ్ కార్యాలయాన్ని సందర్శించిన టీపీవీ శర్మ

ఇబ్రహీంపట్నం రూరల్: పల్లెపల్లెకు పోస్టల్ సేవలు విస్తరించాలని తపాలా శాఖ సౌత్ ఈస్ట్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ టీపీవీ శర్మ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని బ్రాంచ్ పోస్టాఫీసును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్ శాఖ ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడపగడపకు పోస్టాఫీస్ నినాదంతో స్థానిక ప్రజలతో మమేకమవుతూ అత్యధిక చిన్నమొత్తాల పొదుపు ఖాతాలను తెరిచిన బ్రాంచ్ మాస్టర్ మురళీధర్‌రెడ్డి, ఎంఓ రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాందాస్‌పల్లి బ్రాంచ్ మాస్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని గిరిజన అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కేఈ రామేశ్వరి సూచించారు. వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో కయాకింగ్, కినోయింగ్, సెయిలింగ్ తదితర వాటర్ స్పోర్ట్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి గాను.. ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతిలో 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. ఐటీడీఏ మైదాన ప్రాంత జిల్లాలకు సంబంధించిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 26వ తేదీలోపు రంగారెడ్డి కలెక్టరేట్‌లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 8885201009, 9989023016 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

ఓయూలో 'సాంస్కృతిక' హంగామా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీ, ఠాగూర్ ఆడిటోరియాలలో రెండు రోజులు పోటీలు జరగనున్నాయి. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తొలి రోజు 114 కాలేజీలకు చెందిన 1008 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

27 నుంచి 'పది' ప్రీ ఫైనల్స్

సాక్షి, సిటీబ్యూరో: పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలను పురస్కరించుకొని ఈ నెల 27 నుంచి ప్రీ ఫైనల్స్ పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఏకకాలంలో పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టింది. వరుసగా ఆరు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

క్రీడా పోటీలకు మంచి ఆదరణ

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బంజారాహిల్స్: ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ థీమ్‌తో సికింద్రాబాద్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను సికింద్రాబాద్ పార్లమెంట్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఏర్పాటు చేశామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన ఈ క్రీడలను మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించిన నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలకు స్థానిక యువత నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పలు క్రీడా మైదానాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, సెంట్రల్ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు చిట్టబోయిన సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ సర్కిల్స్!

- నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన తోట శ్రీనివాస్ ఫిబ్రవరి 6న కొత్తూరు పెంజర్ల బైపాస్ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- కొత్తూరు వై జంక్షన్ వద్ద అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనుల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన బైక్ యాక్సిడెంట్‌లో రంగాపూర్‌కు చెందిన సురేష్ తన తల్లితో పాటు మూడేళ్ల వయసున్న కూతురును కోల్పోయాడు.
- జేపీదర్గాకు వెళ్లే సర్కిల్ వద్ద సైతం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



ప్రమాదాలకు నెలవుగా మారిన వై జంక్షన్ కూడలి

- డిజైన్ లోపాలను సరిదిద్దడంలో అధికారుల నిర్లక్ష్యం
- మృత్యు కుహరాలుగా మారిన రహదారి కూడళ్లు
- ఏటా వందలాది మంది దుర్మరణం
- ఆదాయం తప్ప.. ప్రయాణికుల బాధలు పట్టని రోడ్డు నిర్మాణ సంస్థలు

కొత్తూరు: ప్రజారవాణా కోసం నిర్మించిన రహదారులు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. డిజైన్ లోపాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పలు గ్రామాల వద్ద సబ్ రోడ్ల అభివృద్ధిని గాలికొదిలేశారు. లోపాలను సరిదిద్దాల్సిన ఎన్‌హెచ్‌ఏఐ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా.. రోడ్డును డెవలప్ చేసిన ప్రైవేట్ సంస్థ కేవలం ఆదాయ సేకరణపై దృష్టిపెట్టింది. ఫలితంగా వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో 433 రోడ్డు ప్రమాదాలు జరగగా 153 మంది, 2022లో జరిగిన 367 ప్రమాదాల్లో 118 మంది, 2023లో ఇప్పటి వరకు చోటుచేసుకున్న 54 యాక్సిడెంట్లలో 13 మంది మృతి చెందగా వందలాది మంది గాయాలపాలయ్యారు.

తప్పని పరిస్థితుల్లో ప్రధాన రోడ్లపై..

కొత్తూరు వై జంక్షన్ నుంచి షాద్‌నగర్ పరిధిలోని అన్నారం గేటు వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర బైపాస్(జాతీయ) రహదారిని నిర్మించారు. అప్పటి నుంచి ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్లను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో సమీప గ్రామాల ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో మెయిన్ రోడ్ల మీదుగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. హైవేపై యాక్సిడెంట్ల సంఖ్య పెరుగుతుండటంతో పోలీసు, ఎన్‌హెచ్‌ఏఐ, ట్రాఫిక్ అధికారుల ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితమే ఆయా కూడళ్లను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు.



కూడలిలో ఢీకొన్న వాహనాలు

ఇందులో భాగంగా ధన్‌సింగ్‌తండా, బండకుంటతండా, మేకగూడ రోడ్డుతో పాటు పలు సర్కిళ్లను పూర్తిగా మూసివేశారు.

పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ

జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలను అటు ఎన్‌హెచ్‌ఏఐ, రహదారిని అభివృద్ధి చేసిన సంస్థలు పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. టోల్ ప్లాజాల ఏర్పాటుతో నిత్యం లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న రోడ్డు నిర్మాణ సంస్థలు వాహనదారుల రక్షణను గాలికి వదిలేశాయని మండిపడుతున్నారు.

వంతెనలు నిర్మిస్తేనే..



కొత్తూరు నుంచి అన్నారం గేటు వరకు జాతీయ రహదారిపై పలు కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ వంతెనలు, అండర్ పాస్‌లు నిర్మిస్తేనే యాక్సిడెంట్లను అరికట్టే అవకాశం ఉంది. ఆయా సర్కిళ్ల వద్ద తాత్కాలికంగా వేగ నియంత్రికలను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వీటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నాం.

– శ్రీశైలం, ట్రాఫిక్ సీఐ, షాద్‌నగర్



కన్హాలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న గిరిజన గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి రొనాల్డ్ రోస్

కొత్త పరిశోధనలపై దృష్టి పెట్టండి

- బయో, ఫార్మా రంగాల్లో మార్పులు తేవాలి
- గిరిజన, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రొనాల్డ్ రోస్
- కన్హా శాంతివనంలో బయోమి- 23 సదస్సు ప్రారంభం

నందిగామ: బయో, ఫార్మా రంగాల్లో ఇటీవలి కాలంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇందుకు అనుగుణంగా విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజన, గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి రొనాల్డ్ రోస్ అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన బయోమి- 23 అంతర్జాతీయ సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థుల కోసం పలు రంగాల్లో ప్రసిద్ధి చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రొఫెసర్లతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల కరోనా వైరస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మన బయో, ఫార్మా రంగాలు ప్రపంచ మానవాళికి వెన్నుదన్నుగా నిలిచాయని స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితులను ముందస్తుగా అంచనా వేసి, వాటిని తట్టుకునేందుకు అవసరమైన పరిశోధనలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు దేశాలనుంచి హాజరైన ఫార్మా నిపుణులు మాట్లాడుతూ.. ఫార్మా రంగానికి హైదరాబాద్ రాజధానిగా మారిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమెరికా టోలేడో యూనివర్సిటీ ప్రొఫెసర్ స్కాట్ హాల్, ఫ్రాన్స్ ఎంబసీ అధికారి స్టాన్స్, కేంద్ర ప్రభుత్వ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాంకిషన్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ రెడ్డన్న, ఫార్మారంగ నిపుణుడు డాక్టర్ శశిర్ కుమార్, ప్రొఫెసర్ పన్నుర్ సెల్వం, డాక్టర్ దర్శనా జోషి, గిరిజన గురుకుల విద్యాలయాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహన బీమాలో మాయాజాలం

- ఏడాదికి బదులు నెల వ్యవధితో బీమా పత్రాలు
- వాటి ఆధారంగానే ఆర్టీఏ ఫిట్‌నెస్ ధ్రువీకరణ
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- ఇప్పటికే పలుచోట్ల నకిలీ బీమా పత్రాల అమ్మకాలు

సాక్షి, సిటీబ్యూరో: వాహన బీమాలో కొన్ని సంస్థలు మాయాజాలం చేస్తున్నాయి. ఏకంగా ఆర్టీఏ అధికారులనే బురిడీ కొట్టిస్తున్నాయి. సదరు సంస్థల బీమాకు వాహన్ పోర్టల్‌లోనూ ఆమోదం లభించడం గమనార్హం. సాధారణంగా ఎలాంటి వాహనాలకైనా ఏడాదికోసారి బీమాను తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలి. బీమా సంస్థలు కనీసం ఏడాది ప్రీమియాన్ని కలిగి ఉంటాయి. ప్రస్తుతం కొన్ని బీమా సంస్థలు నెల రోజుల వ్యవధితో పత్రాలను అందజేస్తున్నాయి. వీటి ఆధారంగానే కొందరు అధికారులు వాహనాలకు అన్ని రకాల పౌరసేవలను అందజేస్తున్నారు. వాహనాల ఫిట్‌నెస్, బదిలీ, అమ్మకాలు, చిరునామా మార్పు వంటి అంశాల్లో అన్ని రకాల డాక్యుమెంట్‌లతో పాటు సదరు వాహనానికి ఉన్న బీమా కాలపరిమితిని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి. కనీసం ఏడాది పాటు బీమా గడువు ఉన్న వాహనాలకే ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించి వాహన సామర్థ్యాన్ని ధృవీకరించవలసి ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతీయ రవాణా కేంద్రాల్లో ఈ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా ఆటో రిక్షాలు, క్యాబ్‌లు వంటి ప్రజా రవాణా వాహనాల్లో ఇది బేఖాతరు అవుతోంది. ప్రయాణికులు, వాహనాల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎంతో కీలకంగా భావించే బీమాపత్రాల్లో ఎలాంటి పారదర్శకతను పాటించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'ఇలాంటి బీమా పత్రాలకు వాహన్ పోర్టల్‌లో సైతం ఆమోదం లభించడం విచిత్రంగా ఉంది' అని ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన మోహన్ అనే వాహన యజమాని విస్మయం వ్యక్తం చేశారు.

తప్పించుకొనేందుకే...

నెల రోజుల గడువుతో ఇస్తున్న బీమా పత్రాలు ఇటు వాహనదారులకు, అటు సదరు బీమా సంస్థలకు ఉభయ తారకంగా మారాయి. కొందరు వాహన యజమానులు బీమా భారాన్ని తప్పించుకొనేందుకు కేవలం రూ.1500 చెల్లించి నెల గడువు కలిగిన బీమాను పొందుతున్నారు. ఇది ఆ సంస్థలకు చక్కటి ఆదాయ మార్గంగా మారింది. నిజానికి ఆటోరిక్షాలు, క్యాబ్‌లు, తదితర వాహనాలకు ఏడాది ప్రీమియం కలిగిన థర్డ్‌పార్టీ బీమా పొందాలంటే రూ.7000 నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతుంది. వ్యక్తిగత కార్లకు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఈ భారాన్ని తప్పించుకొనేందుకే బీమా సంస్థలు, వాహనదారులు కొత్త ఎత్తుగడను ఎంచుకొన్నాయి. బీమా ప్రీమియం గడువును ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఆర్టీఏ అధికారులు వాహనాలకు ఫిట్‌నెస్ ఇచ్చేస్తున్నారు.

ఎల్లలు దాటిన కీర్తి



ఎస్‌డీ. సాధియాబేగం



ఆర్.లావణ్య



డి.నందిని



జె.కళ్యాణ్



కె.పవన్



హెచ్.మహిమాలక్ష్మి



ఇ.శివచరణ్



శ్రీనవ్య

- స్పేస్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక
- ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని అమెరికా నుంచి ఆహ్వానం



లూథియా

మహేశ్వరం: ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో తొమ్మిదో తరగతి చదువుతున్న 9మంది విద్యార్థులు 2023 స్పేస్ డెవలప్‌మెంట్ కాంటెస్ట్ పోటీలకు ఎంపికయ్యారు. అంతరిక్షంలో మానవులు నివాసం ఉండేందుకు అవసరమైన కాలనీల నిర్మాణం, ఆహార పంటల ఉత్పత్తి, కృత్రిమ గురుత్వాకర్షణ అనే మూడు అంశాలపై గైడ్ టీచర్ కె.బాబు ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు రూపొందించి పంపించారు. నాసా అనుబంధ సంస్థ నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) వారు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ మేరకు మే 25నుంచి 28 వరకు అమెరికాలోని టెక్సాస్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాల్సిందిగా మంగళవారం ఆహ్వానం పంపించారు. ఇందుకు ఎంపికైన విద్యార్థులు సాదియాబేగం, లావణ్య, నందిని, కళ్యాణ్, కె.పవన్, మహిమాలక్ష్మి, శివచరణ్, శ్రీనవ్య, లూథియాతో పాటు ఉపాధ్యాయులు కె.బాబు, కె.నాగకళను.. ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పిల్లల తారుమారు

వనస్థలిపురం: వార్డుబాయ్ చేసిన తప్పిదంతో పిల్లలు మారిపోయి గందరగోళం నెలకొన్న సంఘటన మంగళవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వనపర్తికి చెందిన జ్యోతి కుటుంబం అల్మాస్‌గూడలో నివాసం ఉంటోంది. మంగళవారం ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే సిబ్బంది తల్లికి బిడ్డను చూపించారు వార్డుకు మార్చే సమయంలో వార్డు బాయ్ రమ్య అనే మహిళకు జన్మించిన మగబిడ్డను జ్యోతి పక్కన పడుకోబెట్టాడు. ఇది గమనించిన జ్యోతి బంధువులు ఆడపిల్ల పుట్టిందని చెప్పి మగ పిల్లాడిని ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించడంతో.. జరిగిన పొరపాటును గుర్తించి ఆడపిల్లను వారికి అప్పగించారు.

'స్వాహా పర్వం'పై ఆరా

- జిల్లాలో చర్చనీయాంశమైన 'సాక్షి' కథనం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు క్యూ కట్టిన బాధిత రైతులు

యాచారం: 'పరిహారం.. స్వాహా పర్వం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై మంగళవారం జిల్లా అంతటా తీవ్ర చర్చ జరిగింది. ఫార్మాసిటీ భూసేకరణలో అధికారులు చేతివాటానికి పాల్పడడం, అర్హులైన వారికి పరిహారం ఇవ్వకుండా, నకిలీలకు కోట్ల రూపాయలు చెల్లించడం హాట్ టాపిక్‌గా మారింది. పరిహారం అందజేతలో చేతివాటానికి పాల్పడిన కొంత మంది అధికారులు నేరుగా నకిలీలకు ఫోన్లు చేసి.. మీరు డబ్బులు ఇచ్చినట్లు ఎక్కడా మా పేర్లు బయటకు చెప్పవద్దు.. అని ప్రాధేయపడ్డట్లు సమాచారం. రైతులతో పాటు నేరుగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి మమ్మల్ని కాపాడండి అని వేడుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కొంత మంది రైతులు 'సాక్షి' ప్రతినిధులకు ఫోన్లు చేసి మాకిచ్చిన డబ్బుల్లో సగం అధికారులే తీసుకున్నారు. భూ పరిహారం కింద మా ఖాతాల్లో చెక్కులు వేసిన మరుసటి రోజే అధికారులు, వారి బంధువుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. కొన్నిసార్లు నేరుగా నగదు అందజేశాం అని చెప్పడం విశేషం. ఫార్మాసిటీ భూసేకరణలో భాగస్వాములైన అధికారులు, వారి బంధువుల బ్యాంకు లావాదేవీలపై సమగ్ర విచారణ చేపడితే మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఫార్మాసిటీలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ఫిర్యాదు చేసేందుకు మంగళవారం కలెక్టరేట్ వద్ద బాధితులు క్యూ కట్టారు. 'సాక్షి' కథనంపై రెవెన్యూ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ఆరా తీసినట్లు సమాచారం.

కల్వర్టులు కబ్జా

- వరద పారే వంతెనలను మూసేస్తున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



నల్లవెల్లి- వెంకటేశ్వరతండాల మధ్య కల్వర్టును మూసేయడానికి మట్టి నింపుతున్న దృశ్యం

యాచారం: రియల్ ఎస్టేట్ ముసుగులో కొంతమంది వ్యాపారులు కల్వర్టులను మింగేస్తున్నారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వంతెనలు మాయమయ్యే దుస్థితి నెలకొంది. గ్రామాల్లోని కల్వర్టులను మూసేస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగరానికి సమీపాన ఉన్న యాచారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎకరా భూమి ధర రూ.50 లక్షలు దాటింది. దీంతో రియల్ వ్యాపారుల కన్ను చెరువులు, కుంటలు, కల్వర్టులున్న సమీపాల్లోని వ్యవసాయ భూములపై పడింది. వీటి పక్కనున్న స్థలాల ధర కొంత తక్కువగా ఉండటంతో వీటిపై పడుతున్నారు. మండలంలోని నల్లవెల్లి, మాల్, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లోని దూర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు.

నింబంధనలు బేఖాతర్

రియల్ వ్యాపారులు వెంచర్లు చేసే విషయంలో నిబంధనలు పాటించడం లేదు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే విషయంలో వీటి పక్కన చెరువులు, కుంటలు, కల్వర్టులు ఉన్నాయా.. లేదా..? వరద నీరు పారే ప్రాంతమా అనే వివరాలను పట్టించుకోవడం లేదు. ఇలా ఉంటే ఇరిగేషన్ శాఖ అనుమతులు పొందాలి. కానీ వ్యాపారులు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై నిబంధనలకు పాతరేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

భారీ వర్షాలు కురిస్తే..

భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు పారే విధంగా గ్రామాల్లో కల్వర్టులతో పాటు చెక్ డ్యాంలు, వరద కట్టలు నిర్మించారు. ఇరిగేషన్, ఈజీఎస్, నాబార్డు నిధులతో తక్కళ్లపల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మొండిగౌరెల్లి, యాచారం, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాడిపర్తి తదితర గ్రామాల్లో రూ.లక్షలు ఖర్చు చేసి చెక్‌డ్యాంలు, కల్వర్టులు కట్టారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఇవన్నీ పొంగిపొర్లాయి. ఈ సమయంలో ఆయా గ్రామాల్లో కబ్జాకు గురైన, కనుమరుగైన కల్వర్టులు, వరద కట్టలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడం, నీరు పారే కాల్వలు ఎండిపోవడంతో మళ్లీ అక్రమార్కుల చూపు ఇటువైపు మళ్లింది. కల్వర్టుల సమీపంలోని భూములను కొనుగోలు చేస్తూ వెంచర్లు నిర్మిస్తున్నారు.

భవిష్యత్ తరాలకు ఇబ్బంది



లాభాలు పొందాలనే ఆశతో భవిష్యత్తు తరాలను ఇబ్బందులకు గురిచేయొద్దు. కల్వర్టులు, చెక్‌డ్యాంలు, వరద కట్టలను మాయం చేయొద్దు. వర్షాలు కురిసినప్పుడు వరద పారే విధంగా ఉంటేనే పర్యావరణానికి ప్రమాదం ఉండదు.

– మర్పల్లి అంజయ్య యాదవ్, మాజీ సర్పంచ్, మొండిగౌరెల్లి

స్వయంగా పరిశీలిస్తున్నా



వ్యవసాయేతర భూములుగా మార్చాలనే అర్జీలు వస్తే స్వయంగా ఫీల్డ్ విజిట్ చేస్తున్నా. చెరువులు, కుంటలు, వరద కట్టలు, చెక్‌డ్యాంలు, కల్వర్టుల సమీపాల్లో ఉంటే నింబంధనల ప్రకారమే నాలా అనుమతులు మంజూరు చేస్తున్నాం. విరుద్ధంగా ఉంటే రద్దు చేస్తున్నాం.

– సుచరిత, తహసీల్దార్ యాచారం


రథాన్ని లాగుతున్న భక్తులు


రాజరాజేశ్వరీ దేవతల విగ్రహాల ఊరేగింపు

రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

- రథాన్ని లాగేందుకు పోటీపడిన యువకులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐదో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం రాజరాజేశ్వర, రాజేశ్వరీ విగ్రహాలను రథంపైన పెట్టి ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తుక్కుగూడ జేఎస్ గ్రాండ్ హోటల్ వారి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జగర్దస్త్ ఫేమ్ పవన్ టీమ్ సభ్యులు స్కిట్స్, డైలాగ్‌లతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఈఓ మురళీకృష్ణ, గ్రామ సర్పంచ్ కె.ప్రియాంక, ఎంపీటీసీలు సుదర్శన్ యాదవ్, అనురాధ, ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, మహేందర్, రవీందర్, వెంకటేష్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు యాదయ్య, ఈశ్వర్, కుమార్, నాగేశ్వర్, నవీన్, ఏకలవ్య, జంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, భక్తులు పాల్గొన్నారు.


కళాకారుల సాంస్కృతిక కార్యక్రమం


ఉత్సవాలకు హాజరైన భక్తుజనసందోహం

రేగడిచిల్కమర్రిలో ఈతచెట్ల తొలగింపు

నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐకి వినతి

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలోని రేగడిచిల్కమర్రి గ్రామంలో ఈత చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం గౌడసంఘం నాయకులు ఎక్సైజ్ సీఐ రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... షాద్‌నగర్ ప్రాంతంలో కొందరు రియల్ వ్యాపారులు ఫాం ల్యాండ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. వెంచర్లను అభివృద్ధి చేసే క్రమంలో ఈతచెట్లను నరికివేస్తున్నారని అన్నారు. ఈతచెట్లను తొలగించడంతో వృత్తినే నమ్ముకొని జీవనోపాధిని పొందుతున్న గౌడన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈత, తాటిచెట్లను తొలగించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఈ నిబంధనను రియల్టర్లు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఈతచెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. ఈతచెట్లను నరికినవారిపై ఆబ్కారీ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గౌడసంఘం నాయకులు శివరాములుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములుగౌడ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శంకర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, విజయ్‌గౌడ్, వంశీగౌడ్, అరుణ్‌గౌడ్, ఉదయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

దళిత ఎమ్మెల్యేకు అవమానం

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

ఆమనగల్లు: సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యుడు సాయన్న అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించకుండా ప్రభుత్వం అవమానించిందని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజల అభిమానంతో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్న మరణానంతరం.. దళిత ఎమ్మెల్యే అని ప్రభుత్వం చిన్నచూపు చూసిందని, ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ప్రజల మానప్రాణాలతో చెలగాటమాడిన నిజాం రజాకారుల వారసులకు ప్రజాధనాన్ని వెచ్చించి ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దళితులు అంటే చిన్నచూపు అని మొదటి నుంచి కేసీఆర్ దళితులను అవమానిస్తున్నారని ఆరోపించారు. దళితులను అవమానించిన కేసీఆర్‌కు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పే రోజులు దెగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్‌కు తరలిరండి: పీఆర్టీయూ


ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులు

కేశంపేట: ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుర్రం చెన్నకేశవరెడ్డి గురువారం నామినేషన్ వేయనున్న సందర్భంగా టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ ఓటర్ల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపైన పోరాడుతున్న సంఘం పీఆర్టీయూ అని అన్నారు. అపరిష్కారంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకోవాలంటే పీఆర్టీయూ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యారంగ సమస్యలపై కూడా గలమెత్తిన ఏకైక సంఘం పీఆర్టీయూనే అని అన్నారు. ఓటర్లు ఆలోచించి ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, కరుణాకర్‌గౌడ్, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


అభియోగ పత్రాలను విడుదల చేస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై అభియోగ పత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొక్కా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... రెండుసార్లు అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవునిపల్లిలో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ పనులనుప్రారంభించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అదేవిధంగా కొత్తూరు, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. షాద్‌నగర్ ప్రాంతంలో స్పాంజ్, ఐరన్, ఫార్మా పరిశ్రమల కారణంగా కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలం అయ్యిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, అందెబాబయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేష్‌గుప్త, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్

షాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని వెంటనే ఏర్పాటు చేసి దానికి రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్చి 12న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 9 సంవత్సరాలుగా ఉద్యమనాయకుడు కేసీఆర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 20 శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకి ప్రాధ్యానత కల్పించాలని చెప్పారు. ఉద్యకారులకి పెన్షన్, ఉచిత బస్సు, ట్రైన్ పాసులను, ఆరోగ్య కార్డులను, 300ల గజాల ఇంటి స్థలాన్ని, వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి గౌరవించాలని, అన్ని రాజకీయ పార్టీలు ఉద్యకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో విద్యార్థి ఉద్యమకారులకి కోటా కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు దేశమల్ల ఆంజనేయులు, కుమ్మరి చెన్నయ్య, మహేశ్వర్‌రెడ్డి, శ్రీను, మతీన్, నహబ్, షేక్ ఖలీల్, వెంకటస్వామి, కళాకారులు శివకుమార్, రమేష్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

శభాష్.. జైస్వీ

జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్

హుడాకాంప్లెక్స్: జిమ్నాస్టిక్స్ పోటీల్లో మణికొండకు చెందిన ఆరేళ్ల జైస్వీ అత్యుత్తమ ప్రతిభ కనపరిచింది. ఇటీవల సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 200 మంది చిన్నారులు పాల్గొన్నారు. మణికొండకు చెందిన విజయబాబు, స్వప్న దంపతుల కుమార్తె జైస్వీ అత్యుత్తమ విన్యాసాలను ప్రదర్శించి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. గత ఏడాది రష్యాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనపర్చి సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకున్న ఆమె తాజాగా గోల్డ్‌మెడల్‌ను సొంతం చేసుకుంది. ఇది జైస్వీకి సెకండ్ ఇంటర్నేషనల్ మెడల్. మూడేళ్ల వయసు నుంచే కోచ్ అల్లిక జాయ్ వద్ద శిక్షణ పొందుతుంది. జిల్లా స్థాయిలోనూ జైస్వీ 15పైగా మెడల్స్ సాధించింది.



జైస్వీ జిమ్నాస్టిక్స్ విన్యాసాలు

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

కందుకూరు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల నిర్వహణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. మంగళవారం కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ గురుకులాల పనివేళలను మార్చాలని, సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగి మాణిక్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బుగ్గరాములు, మహేశ్వరం మండల ప్రధానకార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి తిరుమల శ్రీనివాస్, హనుమాన్‌దాస్, కందుకూరు మండల అధ్యక్షుడు డాక్టర్ కల్లేష్, ప్రధానకార్యదర్శి డాక్టర్ జేబీ రాములు, కార్యదర్శులు కృష్ణయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వాలు మారినా పంచాయతీ కార్మికుల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26వేల కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు మల్టీ పర్పస్ విధానాన్ని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రానికి పాదయాత్ర చేరుకుంది. అనంతరం స్థానిక శివాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి ఉద్యోగ భద్రత లేకపోవడంతో నిత్యం అభద్రతాభావంతో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయ మండిపడ్డారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించేంత వరకూ తమ పోరాటం కొనసాగుతుందని.. ఈనెల 28న ఇందిరా పార్కులో జరిగే ముగింపు సభ వరకు ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, రాష్ట్ర నాయకులు వెంకటేశ్, గణపతి రెడ్డి, మహేష్ సుధాకర్, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, మండల కార్యదర్శి నర్సింహ, రవికుమార్, రుద్రకుమార్, కార్మికులు పాల్గొన్నారు.


అబ్దుల్లాపూర్‌మెట్‌లో కార్మికుల పాదయాత్ర

ఫాంహౌస్‌పై పోలీసుల దాడులు

మహిళ, ఐదుగురు విటుల అరెస్ట్

కొత్తూరు: మహేశ్వరం మండలంలోని ఓ తండాకు చెందిన నాయకుడికి కొత్తూరు పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో ఫాంహౌస్ ఉంది. దీంట్లో పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్), స్థానిక పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా వెస్ట్ బెంగాళ్‌కు చెందిన ఓ మహిళ (23), మహేశ్వరం మండలంలోని సుభాన్‌పూర్, పెద్దమ్మతండా, చిన్నతూప్ర, నల్లచెర్వుతండా, మన్సాన్‌పల్లి గ్రామాలకు చెందిన ఐదుగురు విటులనుగుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మహిళను కడ్తాల్ సమీపంలోని ప్రజ్వల హోంకు, విటులను రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మూడు కార్లు, 9 సెల్‌ఫోన్లు, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలరాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో రిజర్వేషన్లపై అనుచిత పోస్టు

వ్యక్తిపై కేసు నమోదు

చేవెళ్ల: సోషల్ మీడియా గ్రూపులో అంబేడ్కర్ ఫోటో, రాష్ట్రపతి ద్రౌపతిముర్ముల ఫోటోలతో పాటు రిజర్వేషన్లపై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిని చేవెళ్ల పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు, ప్రజాసంఘాలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి.. సోషల్ మీడియాలో రిజర్వేషన్లపై అనుచిత వాఖ్యలతో పోస్ట్ చేయటంపై చేవెళ్లలోని అంబేడ్కర్ సంఘం, ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలిపి ఆందోళన చేపట్టారు. ఈ అనుచిత పోస్ట్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘం ఫిర్యాదు మేరకు పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దళిత నేతలు, రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.